# విముక్తి కోసం

బకెట్‌లో 'టీ' గ్లాసులు కడుగుతున్న వరాలమ్మ, 'మీరు - నువ్వు' అన్నమాట విని చివాలున తలెత్తి చూసింది.

ఎవరో అనుకుని తడబాటుగా, జంకుగా మీరు నువ్వు అన్నాను. కాని వరాలమ్మ అనుమానంలేదు. గెడ్డం అంచున పుట్టుమచ్చ, నొక్కు నొక్కుల తలకట్టు, ఆ ముఖం ఆ కనులు, మార్పేమీలేదు. అయితే వయసు తెచ్చిన మార్పు తలలో అక్కడక్కడ తెల్ల వెంట్రుకలు. అప్పటికన్నా కాస్త లావెక్కిన శరీరం, గుండ్రం తేలిన ముఖం.

ఆమెకూడా నాలానే వెంటనే నన్ను గుర్తు పటలేక 'మీరు నువ్వు' అని ఆగిపోయింది.

"అవును. నేను వెంకటేశాన్ని. నువ్వు వరాలమ్మవి కదూ!" అన్నాను నవ్వుతూ.

ఎవరో ఆత్మీయులను చూడగలిగినట్లు ఆమె కనులు మెరిశాయి సంతోషంతో ఓసారి. నువ్వు ఆ వెంటనే ఆ కనులలో మళ్ళీ నీలి నీడలు తారట్లాడాయి.

చుట్టూ ఓసారి కలియజూసి "వెంకటేశూ బాగున్నావా?" అడిగింది వరాలమ్మ. ఆ ప్రశ్నతో ఆగిపోయిన ఆమె గొంతులో మరో వెయ్యి ప్రశ్నలు నొక్కి పెట్టినట్లు అనిపించింది నాకు.

"ఆ బాగున్నాను. నువ్వో!..." అని ఇంకేమీ ఆ పైన ప్రశ్నించలేక నేను ఆగిపోయాను. ఆమె గురించి తెలుసుకోవాలని నాకు చాలా ఆత్రుతగా ఉంది. ఏనాటి వరాలమ్మ! పదిహేను సంవత్సరాల క్రితం, నేను ఆరవతరగతి చదువుతూన్నప్పుడు, కరణాల వరాలమ్మ భర్తపోయి పుట్టింటికి వచ్చింది. ప్రతిరోజూ మా స్కూలు వెనుక మర్రిచెట్టు క్రిందినుంచి, ఏటి నీళ్ళకు బిందె పట్టుకుని వెళ్ళేది. అందరూ అనుకునేవారు, వరాలమ్మ మీద చాలామంది కళ్ళు పడుతున్నాయని. నుదుట బొట్టు లేకపోయినా వరాలమ్మ పచ్చగా అందంగా, ఆకర్షణీయంగా ఉండేది. ఆమెను అన్నా వదినా చాలా హీనంగా చూస్తారనీ, హింసిస్తారని అనుకోగా వినేవాణ్ణి. ఒక్కోరోజు సాయంత్రం పిల్లలమంతా మర్రి చెట్టు క్రింద గోలీకాయలాట ఆడుకుంటూంటే బిందె క్రిందపెట్టి చూస్తూ, మాతో మాట్లాడుతూ కూర్చునేది వరాలమ్మ. వాళ్ళ పెరట్లో కాసే రేగుపళ్ళు మాకందరికీ తెచ్చి ఇచ్చేది. మా అందరి దృష్టిలో 'మంచిది' వరాలమ్మ. వరాలమ్మ

మొగుడు చచ్చిపోయాడనీ, ఆమెను అన్నా, వదినా హింసిస్తున్నారని జాలిపడే వాళ్ళం. వరాలమ్మ అప్పుడప్పుడూ మమ్మల్నందర్నీ చుట్టూ కూర్చోబెట్టుకుని కాశీమజిలీ కథలు చెప్పేది. మేం తరచు ఆమెను కథలు చెప్పమని వేధించేవారం మా అన్నయ్య మంచోడు కాడు. చెట్టుక్రింద పిల్లల్లా ఆడుకుంటున్నావా ? అని నిన్న నన్ను కొట్టాడు తమ్ముడూ! రేపు చెప్తాను లెండి. అంది ఓరోజున వరాలమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే. ఆమె అన్నయ్యను అందరం కసితీరా తిట్టుకున్నాం. అప్పుడు మా చెల్లి అడిగింది నన్ను. వాళ్ళన్నయ్య వరాలమ్మని కొడితే దేవుడు ఊరుకుంటాడా? వరాలమ్మ మంచిది కాదా! దేవుడి కథలు చెబుతుంది కదాని దేవుడు వరాలమ్మ అన్నయ్యకు పెద్ద శిక్షే వేస్తాడని అనుకునేవారం.

నేను ఏడవ తరగతి చదివేప్పుడు వేసవి సెలవుల్లో అనుకుంటాను. మా ఊరు సర్కస్ వచ్చింది. అది చిన్న కంపెనీ ఒక ఏనుగు, ఒక చిరుతపులి, రెండు కోతులు, ఒక ఎలుగుబంటి పాతిక ముప్పయి మందిదాకా మనుష్యులు.

నేనెరిగినంత మట్టుకు మా ఊరు సర్కస్ రావటం అదే మొదటిసారి కనుక చాలా సరదాగా తిరిగే వాణ్ని వాళ్ళ డేరాల చుట్టూ. ఆ డేరాలు స్కూలు వెనుక మఱ్ఱిచెట్టు దగ్గర మైదానంలో వేశారు. మా పిల్లలతోపాటు వరాలమ్మ ఆ మనుషులను, జంతువులనూ, వింతగా చూసేది. అందులో ఒకతను వరాలమ్మతో మాట్లాడటం నాకు తెలుసు కాని వాళ్ళేం మాట్లాడుకునేవారో తెలిసేది కాదు.

వారంరోజుల తర్వాత వెళ్ళిపోయారు సర్కసువాళ్లు. వరాలమ్మ కనిపించటం మానేసింది.

వరాలమ్మ సర్కస్ కంపెనీ వాడితో లేచిపోయిందను కున్నారంతా.

పోనీలే సుఖపడింది అనుకున్నారు కొందరు. కాని తామంతా విచారించారు వరాలమ్మ వెళ్ళిపోయినందుకు. ఏదో చిన్నపోయినట్లు ఎవరో ఆత్మీయురాలు దూరమైనట్లూ ఫీలయ్యాం చాలా రోజులు.

కాలగర్భంలో వరాలమ్మ స్మృతి మన పథంలోంచి తొలగిపోయింది.

ఊహించని విధంగా ఈరోజు మళ్ళీ వరాలమ్మ సర్కస్ కంపెనీవారి గుడారాల వెనుక టీ గ్లాసులు కడుగుతూ ప్రత్యక్ష మయ్యే సరికి, ఆమె అవునా కాదా, పలకరించాలా వద్దా! అని తటపటాయించి చివరకు పలకరించాను.

"చూశావు కదూ! ఇదే బాగు" అని నవ్వింది నెమ్మదిగా వరాలమ్మ. ఆనవ్వులో వైరాగ్యం, విషాదం, జీవితంలో చిత్తుగా ఓడిపోయినట్లు నీరస ధ్వని.

"అప్పటివాళ్ళేకదూ వీళ్ళు? కంపెనీ పెద్దది అయ్యిందే! నువ్వు...నువ్వు..." అని మళ్ళీ ఆగిపోయాను.

"ఏంటి వెంక ఈసూ?" అని నవ్వి, రేపు ఈ వేళకిరా? "అమ్మా, నాన్న బాగున్నారా? మా అన్నయ్యా వదినా బాగున్నారా?" కుశల ప్రశ్నలు వేస్తింది.

ఆమెకు నేనింకా జవాబివ్వనే లేదు. అటువైపు తెల్లగా, లావుగా ఉన్న ఏభై ఏళ్ళ వ్యక్తి రావటంతో గబగబా లోపలికి వెళ్ళిపోయింది వరాలమ్మ. నారాయణ చచ్చిపోయాడనీ, మీ ఒదిన కూడా నీలానే పుట్టిల్లు చేరిందనీ చెప్పాలనుకున్నాను. మా అమ్మా నాన్న బాగున్నారు. నీ గురించి విచారిస్తుంటారని కూడా అనాలనుకున్నాను. కాని వరాలమ్మ నాతో మరికాసేపు మాట్లాడితే ఆమె కేం ప్రమాదమో! అతన్ని చూస్తూనే లోపలికెళ్ళిపోయింది.

ఒంటెలు, ఏనుగులు, ఎలుగుబంట్లు, పులులు, ఒకటేమిటి చాలా రకాల జంతువులూ, మనుషులూ కంపెనీ బాగానే పెద్దదయ్యింది అనుకున్నాను ఆరోజు సర్కసు చూడాలనుకున్నాను కాని, బంధువులు రావటం వలన వెళ్ళటానికి కుదరలేదు.

మర్నాడు వరాలమ్మ, రమ్మన్న టైముకి సర్కస్ కంపెనీవాళ్ళు విడిది చేసిన గుడారాల వైపు నడిచాను.

నాకోసమే ఎదురు చూస్తున్నట్టుంది వరాలమ్మ. చుట్టూ ఓసారి చూసి ఎవరూ తనను చూడటంలేదని నిర్ధారించుకొని, "అన్నయ్యా, ఒదినా బాగున్నారా?" అని అడుగుతూనే నావైపు ఒక కాయితం విసిరింది.

గబగబా వంగి కాయితం జేబులో పెట్టుకొని, "నారాయణ పోయాడని" చెప్పి ఆమె మనస్సు కష్టపెట్టడం ఆ

క్షణంలో ఇష్టంకాక, "అంతా బాగున్నారు' అని ఏనుగులు కట్టివున్న చెట్లువైపు నడిచాను.

నాకింక అక్కడ నిలవాలనిపించలేదు. వరాలమ్మ విసి విసిరిన కాయితమేమిటో విప్పి చదవాలనిపించి పార్కువైపు నడిచాను.

గడ్డి పొదల చాటున పచ్చికలో కూర్చుని కాయితం మడత విప్పాను. "వెంకటేసూ! నిన్ను చూసిన వెంటనే నాకు ఎంత సంతోష మయ్యిందనుకున్నావ్! పెద్దవాడిని అయిపో యావుకదా, వెంటనే గుర్తుపట్టలేకపోయాను. నువ్వని తెలుసు కున్నాక నీతో నా కష్టం చెప్పుకోవాలనీ. బోరున ఏడవాలనీ అనిపించింది. కాని బోనులో బంధించిన జంతువులకూ, నాకూ పెద్ద వ్యత్యాసం లేదు బతుకులో. అప్పుడు అన్నయ్యా, వదిన పెట్టే బాధలు భరించలేక వాళ్ళనుంచివిముక్తికోసం, అవ్వాళ మన ఊరు వచ్చిన సర్కస్ కంపెనీ యజమాని- అతన్ని 'రింగ్ మాస్టర్' అని పిలుస్తార్లే- అతనితో వెళ్ళిపోయాను. అతను నన్ను పెళ్ళిచేసుకుంటానని తీసుకువచ్చాడు. అత నికి అప్పటికే ఇద్దరు పిల్లలు, భార్యా ఉన్నారని నాకు తెలియదు.

సర్కస్ కంపెనీవాళ్ళు జంతువుల్ని కొంటారు. నేను వాళ్ళు కొనకుండా బుక్తికోసం ఆ ఊర్లో, ఆ ఇంట్లో లేని స్వేచ్ఛ లభ్యమౌతుందేమో...అనే అరాటంతో అతనివెంట వచ్చి ఒక ఇరుకు పెట్టెలో బంధింపబడ్డాను.

నాకిప్పుడు శీలం లేదు. వ్యక్తిత్వం లేదు. ఒక ఆలోచన లేదు. గమ్యంలేదు. నేను సర్కస్ ఫీట్సు అద్భుతంగా చేసి ప్రేక్షకులను ఆనందింపచేసే, అమ్ముడుపోయిన మనిషిని. సర్కస్ ఫీట్సు నేర్చుకోవటంలో ప్రతిరోజూ వళ్ళు హూనమయ్యేది. అప్పుడు ఏడ్చేదాన్ని మూగగా- ఇంతకన్నా అన్న ఇంట్లో బ్రతుకు ఎంత సుఖంగా ఉండేదని.

నిన్న నువ్వు సర్కస్ చూశావా? ఇవ్వాళ మాత్రం తప్పకరా. నేను కొన్ని రోజులుగా ఈ జీవితం ఎలా చాలించాలా అని ఆలోచిస్తున్నాను. విముక్తికోసం ఆరాటపడుతున్నాను.

"వెంకటేసూ! వరాలమ్మని పూర్తిగా మరిచిపోయావా నేను చెప్పిన కథలు నీ పిల్లలకు చెప్పి గుర్తుచేసుకుంటావు కదూ? మరి శెలవు. దయుంచు. అన్నట్లు ఆనాటి చిన్న సర్కస్ కంపెనీ, మరో పెద్దకంపెనీతో కలిసిపోయింది. అంతే ఇదే వరాలమ్మ."

ఉత్తరం చదివిన తర్వాత నా మనస్సు ఏమిటో బాధగా బరువుగా తయారయ్యింది. వరాలమ్మకు నేను ఎటువంటి సహాయం చెయ్యగలను?

అన్యమనస్కంగా మళ్ళీ ఆ సర్కస్ గుడారాలవైపే నడిచాను.

నా భుజంమ్మీద చెయ్యివేస్తూ "అలాపడవోయ్! మంచి

పులి వుంది చూద్దాం" అన్నాడు శర్మ. నన్ను వాస్తవానికి తెసూ.

యాంత్రికంగా అతనివెనుక నడిచాను.

పులి బోనులో ముందుకాళ్ళమీద తల ఉంచుకుని పడుకుని తనను జూసే మనుష్యులవయిపు చూస్తుంది. ఆ చూపుల్లో కసి, ఏమీ చెయ్యలేని నిస్సహాయత ఉన్నాయి. 'ఈ పులిని షోలాపూర్ సంతలో కొన్నారట. నిన్నరాత్రి రింగ్ మాష్టర్ని ఏడిపించేసిందనుకో. వళ్లు హూనం చేయించు కుంది కాని బల్లమీద కాళ్ళు పెట్టి నిల్చోలేదు. ఈ పులిని ఎన్నివేల రూపాయలకో కొన్నారట.

చెబుతున్నాడు శర్మ. మహా తెలిసినట్లు వాడికి ప్రతి విషయం ఆరాతియ్యటం, అంతకు మరో ఇంత కథ చేర్చి చెప్పటం అలవాటు.

ఆ పులిని చూస్తుంటే నాకు జాలివేస్తుంది. తగినంత ఆహారం లేక శుష్కించి గత జీవితాన్ని నెమరువేసుకుంటుం దేమో అనిపించింది.

అసలు దాన్ని పట్టితెచ్చే అధికారం ఈ బోనులో బంధించి దానిని హింసించి ఆడించే అధికారం ఈ మనిషికి ఎవరిచ్చారు? నాలో మొలకెత్తిన ఈ ప్రశ్నకు నాకే నవ్వు వచ్చింది. సృష్టిలోని ప్రతి వస్తువునీ ప్రతి జీవాన్నీ తనకోసం ఉపయోగించుకొనే తెలివి ఇచ్చిన దేవుడే అయి ఉంటుంది అని.

పులి లేచి నిల్చుని బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని. నోరు ఆవలించింది. గబ్బుకంపు కొట్టింది. ముక్కుకి రుమాలు అడ్డం పెట్టుకున్నాడు.

అప్పుడు దాని చూపులు క్రూరంగా ఉన్నాయ్. బోను లోంచిబయటపడి మమ్మల్ని నమిలిమింగెయ్యాలని ఉందేమో దానికి.

"దీన్ని కొని ఎంతకాలమైందిట? అదీ కనుక్కున్నావా? అడిగాను శర్మను.

"ఐదారు నెలలయిందట" అన్నాడతను.

చాలని ఇరుకు పెట్టెలో పెరుగుతుంది పులి. పాపం చక్కని అడవుల్లో తిరగాలని, తియ్యని సెలయేటి నీరు తాగాలని చెంగుచెంగున గెంతి పరుగులు తీసే లేళ్ళని. దుప్పులనీ వేటాడి వేడి నెత్తురు తాగాలనీ, పచ్చి మాంసం తినాలనీ, ఈ మనుష్యులనుంచి, ఈ బోనులోనుంచి పారిపోయి నవజీవితాన్ని గడపాలని ఉందేమో పాపం దానికి. కాని దాని జీవితం ఈ బోనులో లేదు . ఈ మనుష్యుల మధ్యే అంతమౌతుందని దానికి తెలుసునో తెలియదో అని జాలిపడ్డాను.

"నువ్వు వెళ్తావా, ఇవ్వాళ సర్కస్ చూస్తావా!" అడిగాడు శర్మ.

"అనుకుంటున్నాను వెళ్ళాలని" అన్నాను.

"చూడవోయ్ బాగుంది. ఆడవాళ్ళు చేశారోయ్

సర్కస్ ఫీట్స్ బ్రహ్మాండంగా ఉన్నాయనుకో. అన్నాడు శర్మ.

ఏవో కబుర్లు చెప్పుకుంటూ ఇంటివయిపు నడిచాం.

*   *   *

సర్కస్‌లో వరాలమ్మని గుర్తుపట్టాను. చేతులు లేని పొట్టి గౌనులో ఉన్నా ఆ ముఖం నాకు బాగా తెలుసు. ముందు కుర్చీలో కూర్చున్న నన్ను ఆమె కూడా చూపింది.

ఏడెనమండుగురు స్త్రీలు ఎత్తునవున్న ఉయ్యాల లూగుతూ అంగవిన్యాసాలు చేస్తున్నారు. అందులో వరాలమ్మ వుంది. పాపం సెగలోంచి పొగలోకి వచ్చింది. జాలి పడ్డాను. క్రింద 'నెట్' కట్టి వుంది.

అంతా నిశ్శబ్దం. ప్రేక్షకులు నేనూ కుతూహలంగా చూస్తున్నాం. పై నుంచి నెట్ తప్పించుకుని ఒక స్త్రీ దబ్బున నేల పడింది.

జనంలో కలకలం, కంగారు. పాపం, అయ్యో చచ్చి పోయిందేమో. గోలగోలగా వుంది. చాలామంది కూర్చున్న వాళ్ళు లేచి నిల్చున్నారు. ఒక ప్రాణికీ మరొక ప్రాణికీ వున్న కనక్షన్ ఏమిటో మరి! నాలో వణుకు - భయం.

ఉయ్యాల లూగిన మిగతా స్త్రీలను పరిశీలనగా చూసిన తర్వాత, పడిపోయిన స్త్రీ వరాలమ్మ అని తెలుసు కున్నాను.

పడీ పడటంతోనే వరాలమ్మను ఈడ్చుకుపోయారు. తర్వాత ఏం వైద్యం చేశారో మరి సర్కస్ అవలేదు. ఆ తర్వాత కార్యక్రమం ప్రారంభమయ్యింది. కాని నేను సరిగ్గా చూసి ఆనందించలేక పోయాను.

లోపలకి వెళ్ళి వరాలమ్మని చూడాలని అనిపించింది. కాని నేను ఎవరినని చెప్పుకోను? ఆమెకూ నాకూ పరిచయం యెలా వాళ్ళకు చెప్పటం? చెప్పినందువలన ఆమెకే ప్రమాదమేమో! పరిపరి విధాల ఆలోచిస్తూ యింటికి వచ్చాను.

ఆ రాత్రి నాకు సరిగ్గా నిద్దర పట్టలేదు.

మర్నాటి ఉదయం సర్కస్ కంపెనీలో ఆడమనిషి చచ్చిపోయిందనే వార్త ఊరంతా పాకి నా చెవులన పడింది.

గతం నెమర వేసుకున్న నా కన్నుల్లో నీరు తిరిగింది. పోనీ ఇప్పటి కా జన్మకు విముక్తి కలిగింది అనుకుని కసులు వత్తుకున్నాను.

సర్కస్ కంపెనీవారు మకాం ఆ ఊరు నుంచి ఎత్తే య్యాలని నిర్ణయించుకున్నారు కాబోలు, డేరాలు విప్పేస్తు న్నారు. ఆ సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూ చూశాను.

మర్నాడు ఉదయం మరో వార్త. రెండు పులులూ, ఒక సింహం చచ్చిపోయాయనీ. వరాలమ్మ మీది నుంచి బంధింపబడ్డ జంతువుల మీాద నుంచి సానుభూతి సర్కస్

కంపెనీ వాళ్ళ మీదికి మళ్ళింది ప్చ్ పాపం. వాళ్ళు ఈ ఊరు వచ్చిన వేళ బాగులేదనుకున్నాను.

జంతువులు యెలా చచ్చిపోయాయి? అనే దానికి, మా శర్మ చెప్పిన కథ.

కరణంగారి పొలంలో చచ్చిన 'పోతు'ని మోసుకు పోవటానికి బారిక నాగన్న నలుగురు మనుష్యుల్ని తీసుకు వచ్చాడు.

"ఒరె నాగన్న పోతు పురుగు కరిచి చచ్చినట్లుంది. పనికొచ్చినవి తీసుకుని మిగతాది పాతెయ్" అని చెప్పాడు కరణం.

"చిత్తం బాబయ్యా!" అన్నాడు నాగన్న.

చచ్చిన యెనుబోతు బరువుగా వుండడంతో, మొయ్యా లేక మొయ్యలేక, బరువుగా అడుగులు వేసూ నడుస్తున్నారు. బాలికలు.

సర్కస్ కంపెనీవాళ్ళకి ఇచ్చేత్తేనో!" అని మిగతా నలుగురితో సలహా చేశాడు నాగన్న.

"ఇచ్చేస్తే డబ్బులొస్తాయి" అన్నాడు ఒకడు.

పురుగు కరిస్తే దీనిమాంసం మనుషులు తింటేనే ఇసం కల్లుసుక్క తాగుదాం" అన్నాడు మరొకడు.

"ఔను మనుషులకయితే పెమాదం కాని ఆటి కేటి నేస్తది? ఆటి ఒల్లంతా ఇసమే అమ్మేయ్" అన్నాడు ఇంకొకడు.

"దర తక్కువ సెప్పక అనుమానం ఒస్తది" అన్నాడు అన్నాడు నాలుగోవాడు.

ఒక్కక్షణం ఆలోచించిన నాగన్న "అయితే అటుకాసి పదండి. అల్లు డేరా విప్పుతున్నారు. ఎల్లిపోతారులా ఉంది, గబగబా నడవండి సీకటి పడిపోతున్నాది" తొందర చేశారు.

రాత్రి ఏడుగంట లయ్యింది. ఎనుపోతుని సర్కస్ ఏనుగులు కట్టివున్న చెట్టుకింద దించారు చారికలు.

వత్తాసుండండి అని కొంచం ముందుకి నడిచి, రెండు రోజులక్రితం సర్కస్‌లో పులుల్నీ, సింహాల్నీ ఆడిస్తూ కనిపించిన మనిషిని చూసి ఆగి "బాబూ! సచ్చిన ఎనుబోతుని తెచ్చాం. కావాలేటి? కొంటారేటి? పుల్లుకి, సివాలకీ ఏత్తారు గావాల?" అడిగాడు నాగన్న వినయంగా.

"పద ఎక్కడుంది చూపించు" అని నాగన్న వెనుక నడిచాడు రింగుమాస్టరు.

"మీ సర్కస్‌లో మీకాడవున్న జంతువుల నన్నిటికీ సాలండి, మరి రెండురోజులవరకు మీరు మేత మెయ్యాక పోయినా పర్లేదు" అన్నాడు నాగన్న పోతును అతనికి చూపిస్తూ.

"అవునండి బాబయ్యా" వంతపాడారు అతని మిత్రులు.

"ఎంతకి ఇస్తావ్" అడిగాడు రింగుమాస్టరు.

"వందకి తక్కువ రాదండి" అన్నాడు నాగన్న.

"బ్రతికినదానికీ లేదు అదు అంత ఖరీదు" నవ్వాడతను.

"బతికినదాన్ని, పనిచేసేదాన్ని మీరు అమ్మతారేటండి. బతికున్నదయితే దీనిఖరీదు మూడొందలు" అన్నాడు నాగన్న.

"వంద రూపాయలివ్వను, మరెంతకిస్తావో చెప్పు" అన్నాడు అతను విసుగ్గా.

"అడిమాటకాదు, మీమాటకాదు. ఎనభై రూపాయలిచ్చెయండి బాబూ!" అన్నాడు ఒకడు.

"డెబ్బయి ఇస్తాను, ఇస్తే యివ్వండి లేకపోతే పొండి" అన్నాడు రింగుమాస్టరు.

"ఇచ్చెయ్యరా, పదికాడ బేరవేటి?" అన్నాడు పోతుకి కాళ్ళకికట్టిన కట్టులు విప్పేసూ మరొకడు.

"మరేటిసేత్తాం. ఊ అయితే డబ్బు లిచ్చెయ్యండి బాబయ్య" అన్నాడు నాగన్న.

ఏడు పదిరూపాయల కాయితాలు ఇవ్వబోతున్న రింగు మాస్టర్ని "సిల్లర కాయితాలివ్వండి బాబయ్య" అడిగాడు నాగన్న.

తమ కెంతంత ఇస్తారో అని చూస్తున్న చారికల ముఖాలు ముడుచుకున్నాయి.

డబ్బుపట్టుకుని కొంచెం దూరం నడిచిన తర్వాత వీధి లైటు వెల్తురులో చేతిలోని కాగితాలు మరోసారి పాక్క

పెట్టుకొని, 'ఇందండ్రా' అని నలుగురికి నాలుగు పదేసిరూపా యిల కాగితాలు తలావకటి ఇచ్చాడు నాగన్న.

"ఇంతేనట్రా ఇత్తావు?" అని తమ అసంతృప్తిని వ్యక్త పరిచారు వాళ్లు యేకగ్రీవంగా.

ఉదారంగా దానంచేస్తున్నట్లు మరో ఏదురూపాయల కాగితం వాళ్ళచేతిలోపెట్టి "పంచుకోండి" అన్నాడు నాగన్న.

అందరూ కల్లుపాకవైపు నడిచారు.

* * *

అర్ధరాత్రి అకలితోవున్న జంతువులు ఆవురావురు మంటూ ఎనుబోతు మాంసం తిన్నాయి.

ఒకటొకటే ఒరిగిపోయాయి.

బంధ విముక్తికోసం మానవభాష మాట్లాడలేని తమను యెందుకిలా బంధించి హింసిస్తున్నారని అడగలేని, ఆ జంతువులు యెంతగా తపించాయో మరి!

"నా కేటి తెల్దు బాబయ్యో" కరణం కాళ్ళముందు పడి దండాలు పెట్టాడు నాగన్న మర్నాటి ఉదయం.

"ఏమిటి జరిగిందిరా?" యేమీ తెలియనివాడిలా అడి గాడు కరణం.

"పాము ఇసం మనుసులకే కాని, జంతువుల కేటీ సెయ్యదనుకున్నాను బాబయ్య ఎదవని" అన్నాడు నాగన్న.

గొప్పచిక్కే వచ్చిందే! సర్కస్ వాళ్ళకిగాని అమ్మా వేమిట్రా వెధవా? అరిచాడు కరణం.

"నుఁరేనండి, బుద్ధితక్కువోణ్ణి" తల దించుకున్నాడు నాగన్న.

"ఎంతకి అమ్మావ్?" గొంతు తగ్గించి నెమ్మదిగా అడిగాడు కరణం.

"నాను అబద్దవాణ్ను, బూదేవి శాళ్చి, డెబ్బయిరూపా యలండి. పోతుని మోసుకెళ్ళినోళ్లు పాతిక రూపాయలిచ్చు కున్నారండి" అన్నాడు నాగన్న. తాను తగువులో ఇరుక్కో కుండా తప్పించగలడని కరణంవైపు ఆశగా చూస్తూ.

"మరి..." అని నసిగాడు కరణం.

అర్థమయింది నాగన్నకి. పంచ మడతలో దాచిన రెండు పదిరూపాయల కాగితాలు తీసి క్రిందపెడుతూ, "సర్కా సులో సచ్చిన ఆడమనిషి యవ్వారంలా, కామాపు సెయ్యండి బాబయ్యా! కేసూ గీసూ లేకుండా" అన్నాడు నాగన్న.

గెద్ద కోడిపిల్లను తన్నుకుపోయినట్లు, కరణం చేతులు పదిరూపాయల కాగితాలు తీసుకున్నాయ్.

"వెళ్ళిరారా! నీ కే భయంలేదు" అని అభయహస్త మిస్తూ, ఎందుకన్నా మంచిది పోలీసోళ్ళకికూడా దణ్ణంపెట్టుకో" అన్నాడు కరణం.

"సిత్తం బాబయ్యా" అని నిబ్బరంగా వెళ్ళిపోయాడు నాగన్న

* * *

"ఏమిట్రా? కంఠతా పట్టిన కథలా చెప్పావు?" అని నవ్వుతూ అడిగాడు శర్మని.

"జరిగింది ఇదేనా, యేదన్నా నేను కరెక్టుగా ఊహించ గలను" అన్నాడు శర్మ.

నేను వరాలమ్మకథ చెప్పాను.

"అయితే కావాలనే గెంతి చచ్చిపోయిందన్నమాట ఆవిడ" అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు శర్మ.

ఇదంతా జరిగి పదిసంవత్సరాలు దాటింది. కాని, స్వంత ఊరు వచ్చినతర్వాత స్కూలు, మఱ్ఱిచెట్టు చూడగానే నాకు వరాలమ్మ గుర్తువచ్చింది.

నాన్నా! దేవుడికథలు చెప్పేవారికి పుణ్యం వస్తుందా? నాయనమ్మ చెబుతుంది!" అని నానిగాడు అడిగిన ప్రశ్నకి.

"ఆఁ వస్తుంది" అన్నాను పరధ్యానంగా.

...o...